నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

సుభాష్‌నగర్: సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వివేకానంద్, వివిధ శాఖల ముఖ్య అధికారులు హాజరవుతారన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ


ఎమ్మెల్యేకు చిత్రపటం బహూకరిస్తున్న అభిమానులు

కుత్బుల్లాపూర్: హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే వివేకానంద్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన పలువురు ఆహ్వానాలు, వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పలు కాలనీలు, బస్తీల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్


పోలింగ్ బూత్‌ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

దుండిగల్: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ శనివారం తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని, అవసరమైతే ఓటరు గుర్తింపు కార్డులో పేరు, చిరునామా తదితర సవరణలు చేసుకోవాలని సూచించారు. ఇందుకుగాను మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద తమ వివరాలను అందజేయాలన్నారు. శని, ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

రైతులకు మెరుగైన వసతులు


సత్తయ్యను సన్మానిస్తున్న బాల్‌రెడ్డి

దుండిగల్: పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు సకాలంలో రుణాలు అందిస్తున్నామని హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి సంఘం కార్యాలయ నిర్వహణ, గోదాముల పర్యవేక్షణ, రైతులకు అందించే విత్తనాలు, సబ్సిడీ రుణాలను వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ సయ్యద్ అసదుల్లా, ఉపాధ్యక్షుడు నల్తూరి కృష్ణ, డైరెక్టర్లు మహిపాల్ రెడ్డి, పద్మావతి, ఈదులకంటి యాదయ్య పాల్గొన్నారు.

మేయర్‌కు ఆహ్వానం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇగ్నిషియో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలుకుతూ నిర్వాహకులు కిషోర్, కృష్ణ మేయర్ కొలన్ నీలారెడ్డికి పత్రిక అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి ఉన్నారు.

ప్రమాదకరంగా నీటి సంపు మూత


కిందికి దిగిన నీటి సంపు మూత

రంగారెడ్డినగర్: డివిజన్‌లోని ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద రహదారిపై నీటి సంపు మూత కిందకు దిగింది. ఇప్పటికే ప్రమాదకరంగా మారిన మూతను తక్షణమే సరి చేయకుంటే భారీ వాహనాల వెళ్లే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అజాగ్రత్తే రోడ్డు ప్రమాదాలకు కారణం


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

నిజాంపేట్: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం నిజాంపేట్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో మియాపూర్ ట్రాఫిక్ సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్ జిల్లా ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అజాగ్రత్త వల్లే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, సిగ్నల్స్ జంపింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్య, సిబ్బంది మల్లేశ్వర్, బాలకృష్ణ తదితరులున్నారు.

చిత్తారమ్మ దేవి జాతరకు..
పోటెత్తిన భక్తజనం


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


ప్రత్యేక అలంకరణలో చిత్తారమ్మ దేవి

సుభాష్‌నగర్: రెండో రోజు గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతరకు భక్తులు పోటెత్తారు. శనివారం గవ్యాంత పూజలు, చండీ హోమం, ఆవాహిక దేవత హోమాలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అధికారులతో ఎమ్మెల్యే సమావేశం..

తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే జాతరలో గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర ఒకటని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. శనివారం జాతరకు వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆదివారం జరిగే ప్రధాన జాతర ఏర్పాట్లపై గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డితో కలిసి ఎమ్మెల్యే సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, విద్యుత్, వైద్య, టాయిలెట్స్, భద్రత తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు 60 మంది..

జాతరకు వచ్చే భక్తులకు, వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని బాలనగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. ఈక్రమంలో రోడ్డుపై వెలసిన పలు దుకాణాలను తొలగించారు. జాతరలో ఒక ఏసీపీ, 4 సీఐలు, 8 మంది ఎస్సైలు, 60 మంది ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహించినట్టు తెలిపారు. ఆలయానికి ఇరువైపులా 200 మీటర్ల మేర వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు ట్రాఫిక్ ఏసీపీ పేర్కొన్నారు. బాచుపల్లి, కూకట్‌పల్లి నుంచి షాపూర్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను గాజులరామారం చౌరస్తా నుంచి ఓక్షిత్ ఎన్‌క్లేవ్, మెట్కానిగూడ, జీడిమెట్ల బస్ డిపో మీదుగా వెళ్లాలని సూచించారు. భారీ వాహనాలు లాల్‌సాహెబ్ గూడ దారిలోని ఇందిరమ్మ కాలనీ మీదుగా వెళ్లాలని తెలిపారు. షాపూర్‌నగర్ నుంచి కూకట్‌పల్లి, బాచుపల్లి వెళ్లే వాహనాలను ఉషా ముళ్లపూడి హాస్పిటల్ వెనక నుంచి చంద్రగిరినగర్, మహాదేవపురం మీదుగా, భారీ వాహనాలు షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్ట మీదుగా వెళ్లాలని తెలిపారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు నాలుగు రోజుల పాటు అమలులో ఉంటాయని చెప్పారు.

ఆదివారం జాతర విశేషాలు..

ఉదయం 3 గంటలకు అభిషేకం, 4 గంటలకు విజయ దర్శనం, తలంబ్రాలతో ఒడి బియ్యం, 11గంటలకు బోనాలు, మూడు గంటలకు ఊరేగింపు, పోతరాజుల నృత్యం, వినోద కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ పేర్కొంది.

భారతీ సిమెంట్స్ ఆధ్వర్యంలో సమావేశం


తాపీ మేస్త్రీలకు గిఫ్టులు అందిస్తున్న సాత్విక్‌రెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను రాష్ట్రంలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి వినాయక స్టీల్ ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాత్విక్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని తెలిపారు. అంతేకాకుండా స్లాబ్ కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సలహాలు ఇస్తారని చెప్పారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు, కార్మికులకు గిఫ్టులు అందించారు. అనంతరం వినాయక స్టీల్ ట్రేడర్స్ డీలర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా బాగుందని చెప్పారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ నరసింహులు, 30 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

మొండి బకాయిలపై కఠిన చర్యలు



దుండిగల్: ఆస్తి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశించారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయంలో శనివారం బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. బిల్ కలెక్టర్లు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి ఆస్తి పన్నులు వసూలు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదే విధంగా బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని, పన్నులు చెల్లించని నేపథ్యంలో ఆస్తులు జప్తు చేయాలని ఆదేశించారు. దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సునంద పాల్గొన్నారు.

28 నుంచి రేణుకా ఎల్లమ్మ దేవి జాతర


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుండిగల్: ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు బౌరంపేటలోని రేణుకా ఎల్లమ్మ దేవి కల్యాణం, భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు జాతరకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, బల్వంత్‌రెడ్డి, యాదగిరి, నాగరాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతులు

ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై స్పందించిన శంభీపూర్ రాజు ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ముగిసిన జాతీయ సమైక్యతా శిబిరం


శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

దుండిగల్: ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరం శనివారంతో ముగిసింది. కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ, జాతీయ సేవా పథకం హైదరాబాద్ రీజనల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో దుండిగల్‌లోని కాలేజీలో నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతా శిబిరాల్లో పాల్గొనడం విద్యార్థులకు గొప్ప అవకాశమన్నారు. ఇతర రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకోవడానికి ఇదొక చక్కని వేదికన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్ రెడ్డి, ఏపీ స్టేట్ ఎస్‌ఎస్‌ఎస్ అధికారి అశోక్‌రెడ్డి, రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, యూత్ ఆఫీసర్ ఆర్.సైదా, సంజయ్ కుమార్, జేఎన్టీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శోభారాణి, కో–ఆర్డినేటర్ ఉదయ్ రంజన్ గౌడ్ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్ 307, 329/1 ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలపై 'సాక్షి'లో వచ్చిన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ తన సిబ్బందితో కూల్చివేతలు చేపడుతుండగా కొంతమంది హిజ్రాలు అడ్డుకున్నారు. ఎట్టకేలకు నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు.

చిన్నారితో సహా గృహిణి అదృశ్యం


రిషిక(ఫైల్)


శృతి(ఫైల్)

సుభాష్‌నగర్: చిన్నారితో పాటు గృహిణి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్‌కు చెందిన దంపతులు అజయ్, శృతి(26)కి రిషిక(2.5) కుమార్తె. అజయ్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా.. శృతి వంట పనులు, కేర్ టేకర్‌గా ఉంది. రోజు మాదిరిగానే ఈ నెల 19న తన పాపను తీసుకుని బయటకు వెళ్లింది శృతి. రాత్రైనా ఇంటికి చేరుకోకపోవడంతో అజయ్ ఆమె మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో నేడు(ఆదివారం) విద్యుత్ నిలిపివేస్తున్నట్టు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల ఎస్‌ఎస్1 సబ్‌స్టేషన్ పరిధిలో వినాయకనగర్, అయోధ్యనగర్, ఏపీఐఐసీ కాలనీ, కళావతినగర్, న్యూ షాపూర్‌నగర్, షాపూర్‌నగర్ మార్కెట్, షాపూర్‌నగర్ మెయిన్‌రోడ్డు, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ ఉండదు.

◆ **నిజాంపేట్:** విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ అలీప్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అలీప్ ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

◆ **చింతల్:** 11 కేవీ ఫీడర్స్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బోయిన్‌పల్లి డివిజనల్ ఇంజినీర్ భిక్షపతి, సెంట్రల్ బ్రేక్ డౌన్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఈశ్వర్ విమల్, ఇండస్విన్, ఎల్ అండ్ టీ, నాగార్జున సికినోడే, రాజ్ ఫుడ్స్, రంగారెడ్డి నగర్, రసూల్ ఫార్మా, ప్రగతి ప్యాక్, అరుణాచలం.. గ్లోబల్ హోమ్స్ ఫీడర్ల పరిధిలోని గాంధీనగర్ శివాజీ విగ్రహం, అల్ఫా కాంప్లెక్స్, ఈశ్వర్ విమల్, గిరినగర్.. గాంధీనగర్‌లోని శివ ప్యాకేజింగ్, గాంధీనగర్ ఎల్ అండ్ టీ వెంకటేశ్వర సైకిట్స్.. రంగారెడ్డినగర్ బాలాజీ ఎలక్ట్రికల్స్, సన్ టిక్ ఇంజినీరింగ్.. పంచశీల కాలనీలోని నందా ఫుడ్స్, రెయిన్‌బో స్కూల్, సాయి లక్ష్మీ ఇండస్ట్రీస్, ఎస్కే ఇంజినీరింగ్, ఎక్కేఎం టెక్నాలజీ, ప్రగతి ప్యాక్, జీహెచ్ సోలార్ సిస్టమ్స్, టాటా హిటాచి, గ్లోబల్ హోమ్స్ ప్రాంతాల్లో, అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు ఏపీహెచ్బీ కాలనీ, రసూల ఫీడర్, ప్రగతి ప్యాక్, జీహెచ్‌ఎంసీ పార్క్, ఏబీ కాలనీ, గిరి నగర్, శ్రీనివాస టవర్స్, హనుమాన్ టెంపుల్, గురుమూర్తి నగర్, సౌజన్యనగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది.

కేవీపీఎస్ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ ఉపేందర్

నిజాంపేట్: కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం బాచుపల్లి సీఐ ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో సామాజిక చైతన్యం నింపడంతో పాటు కుల వివక్షతకు వ్యతిరేకంగా కేవీపీఎస్ పని చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు, మల్లికార్జున్, నవతెలంగాణ చిక్కడపల్లి బుక్ హౌసింగ్ ఇన్‌చార్జి రఘు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ డబ్బా తొలగింపు కోసం వినతి

కుత్బుల్లాపూర్: అక్రమంగా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ డబ్బా తొలగించి వరద నీరు సులువుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కాకతీయనగర్ సంక్షేమ సంఘం నాయకులు శనివారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నర్సింహకు వినతిపత్రం ఇచ్చారు. కూరగాయాల మార్కెట్‌కు బ్రిడ్జి మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో అక్రమంగా గోడలు నిర్మించడంతో పాటు ఫుట్‌పాత్ డబ్బాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఫలితంగా సుమారు 10 కాలనీలతో పాటు ఆగ్రో కంపెనీ నుంచి వచ్చే నీరు కాకతీయనగర్‌లోని ఇళ్లల్లోకి చేరుతుందని చెప్పారు. తక్షణమే డబ్బాలు తొలగించాలని నాయకులు తెలిపారు. ఉప కమిషనర్‌ను కలిసిన వారిలో కాకతీయనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సుబ్రహ్మణ్య స్వామి ఉన్నారు.

వాడవాడలా అక్షింతల పంపిణీ


కొంపల్లిలో భక్తులకు అక్షింతలు అందిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: శ్రీరాముని అక్షింతలను జీడిమెట్ల డివిజన్ ఉడ్స్ కాలనీలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి ఆధ్వర్యంలో భక్తులకు శనివారం అందించారు. అదే విధంగా కొంపల్లిలో బీజేపీ నాయకుడు ఆదిరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో దీపాంచలు, ఒత్తులు, నూనె, పసుపు, కుంకుమతో ప్యాక్ చేసిన బాక్స్‌లు భక్తులకు పంపిణీ చేశారు.


ఉడ్స్ కాలనీలో కమల కిషోర్ దంపతులకు అక్షింతలు అందిస్తున్న భిక్షపతి తదితరులు